క్లుప్తంగా

నేడు వాహనాల వేలం

కొల్లాపూర్: పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయం ఆవరణలో బుధవారం వాహనాల వేలం నిర్వహించనున్నట్లు సీఐ నాగిరెడ్డి తెలిపారు. సారా, బెల్లం తరలిస్తూ పట్టుబడిన 7 ద్విచక్రవాహనాలకు వేలం నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు ఉదయం 10:30 గంటల వరకు ఎక్సైజ్ కార్యాలయంలో రూ.5 వేలు డిపాజిట్ చేయాలని కోరారు.

రేపు ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

వెల్దండ: మండలంలోని కుందారంతండాలో నూతనంగా నిర్మించిన హనుమాన్ దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హోమం చేసి భక్తి భజన పాటల కార్యక్రమం చేశారు. స్వామి వారిని డప్పు వాయిద్యాలతో ఊరేగించారు. ఈ నెల 31న ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



ఉప్పునుంతల: మండల కేంద్రంలోని బాలుర ప్రాథమిక పాఠశాలలో మంగళవారం రాష్ట్రీయ బాల స్వస్థ్ కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే)లో భాగంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు మంగ, మహేశ్వర్, ఫార్మసిస్టు రాజు, ఏఎన్‌ఎం రేణమ్మలు విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. ప్రతిరోజు పాలు, పండ్లు, కోడిగుడ్లు, ఆకుకూరలు, చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు వెంకటేష్, చందన, సంగీత, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిభావంతో ప్రశాంతత

కల్వకుర్తి రూరల్: భక్తిభావంతో ప్రశాంతత కలుగుతుందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని మార్చాలా బంగారు మైసమ్మ దేవాలయంలో మంగళవారం అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్ విజయ్ గౌడ్ ఆలయ కమిటీ సభ్యులు నాయకులు పాల్గొన్నారు.

అర్హుల ఎంపికలో అధికారులు విఫలం

చారకొండ: సంక్షేమ పథకాల అమలులో భాగంగా అర్హులను గుర్తించడంతో అధికారులు విఫలం అయ్యారని బీజేపీ మండల నాయకుడు కిరణ్ గౌడ్ ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఆసరా పెన్షన్లు, యువ వికాసం తదితర పథకాలలో అనర్హులను ఎంపిక చేశారని ఆరోపించారు. అధికారులు పూర్తి స్థాయిలో సర్వే చేయలేదని విమర్శించారు. మండలంలోని చారకొండ బైపాస్ రోడ్డు బాధితులు, సిర్సనగండ్ల నిర్వాసితులకు మొదటి ప్రాధాన్యతలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కన్నా, పవన్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

నాయీ బ్రాహ్మణులకు అన్యాయం

చారకొండ: నాయీ బ్రాహ్మనేతరులు సెలూన్ దుకాణాలు పెట్టుకోవచ్చన్న హైకోర్టు తీర్పుతో నాయీ బ్రాహ్మణులు రోడ్డున పడతారని నాయీబ్రహ్మణ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బోల్లంపల్లి రవి ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో మంగళవారం నాయీ బ్రాహ్మణుల సంఘం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కుల వృత్తినే నమ్ముకున్న జీవిస్తున్న నాయీబ్రాహ్మణుల పొట్ట కొట్టడం సరికాదన్నారు. జిల్లా సభ్యులు సత్యానారాయణ, శంకరయ్య, తిరుపతయ్య, వెంకటయ్య, రాము, వెంకటేష్, అంజనేయులు, శ్రీను, అనిల్, రామకృష్ణ, వెంకటేశం తదితరులు ఉన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

పెద్దకొత్తపల్లి: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంఈఓ కొత్త శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం కేజీబీవీ పాఠశాలల్లో నూతనంగా చేరిన విద్యార్థులకు ఉలెన్ దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి లత పాల్గొన్నారు.

పీఈటీ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు నిరంజన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాబీర్ హాజరై నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎస్. నిరంజన్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా సామరమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం. పాండు, మహిళా అధ్యక్షుడిగా స్వరూప, మహిళా ప్రధాన కార్యదర్శిగా అరుణ, జిల్లా ఆర్గనైజ్ సెక్రెటరీగా పురం చందు, కోశాధికారిగా నరేందర్‌ని ఎన్నుకున్నారు.

రోడ్డు పూర్తయ్యేదెన్నడో..?

- బిల్లులు మంజూరు కాక పనులు నిలిపివేత
- ఇబ్బందుల్లో ప్రయాణికులు



నిలిచిన బ్రిడ్జి నిర్మాణం పనులు



చౌట చెరువురోడ్డుపై చేపట్టిన విస్తీర్ణ పనులు

పెంట్లవెల్లి: మండలకేంద్రంలో కొల్లాపూర్ నుంచి జటప్రోల్ వెళ్లే ప్రధాన రహదారి అయిన చౌటచెరువు రోడ్డు మరమ్మతులు, రోడ్డు విస్తీర్ణం చేపట్టాలని గత మూడేళ్ల క్రితం అప్పటి ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి దాదాపు రూ.4 కోట్లతో రోడ్డు విస్తీర్ణం పనులు, చౌటచెరువుపై బ్రిడ్జి నిర్మాణం, మినీ ట్యాంక్‌బండ్ ఏర్పాటు చేయాలని రూ.4కోట్లతో ప్రారంభించారు. కాని ఇప్పటికీ మూడేళ్లు గడుస్తున్నా మరమ్మతులు మాత్రం ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం పనులు పూర్తిస్థాయిలో ఆగిపోయాయి. వర్షాకాలం వచ్చినప్పుడల్లా రోడ్డుపై ప్రయాణం చేయాలంటేనే వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో అనేకసార్లు ప్రయాణికులు ప్రమాదాలకు గురై తీవ్ర గాయాలయ్యాయి. దీంతో త్వరగా పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు పూర్తి చేయండి

ప్రతి వర్షాకాలం చెరువుపై ప్రయాణం చేయాలంటేనే ఇబ్బందులకు గురవుతున్నాం. రోడ్డుకు మట్టి విస్తీర్ణం చేపట్టారు కాని ఇంకా పూర్తి స్థాయిలో పనులు చెయ్యలేదు. త్వరగా పనులు పూర్తి చేయాలని కోరుతున్నాం. అధికారుల చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు.



– సుమన్, పెంట్లవెల్లి

మూడేళ్లుగా ఎదురుచూస్తున్నాం

నా చిన్నప్పటి నుంచి చెరువు రోడ్డు విస్తీర్ణం పనులు అప్పుడు ఇప్పుడు అంటూ కాలం వెళ్లదీస్తున్నారు. మూడేళ్ల కిందట పనులు మొదలుపెట్టారు. ఇప్పటివరకు పూర్తి కాలేదు. అధికారులు స్పందించి పనులు పూర్తి చేయించాలి.



– శివ, వాహనదారుడు

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

కొల్లాపూర్ రూరల్: వన్య ప్రాణుల పరిరక్షణ అందరి బాధ్యత అని కొల్లాపూర్ రేంజర్ శంకర్ అన్నారు. మంగళవారం అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా కొల్లాపూర్ రేంజ్ పరిధిలోని నార్లాపూర్ సెక్షన్ వట్టిమాకుల కుంట ఏరియాలో ఆక్రమణకు గురైన అటవీ భూమిలో సిబ్బంది ఆధ్వర్యంలో వివిధ రకాల రెండు వేల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్య ప్రాణులను వేటాడిన చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ కాశన్న, సెక్షన్ అధికారులు ముజీబ్ ఘోరి, జయరాజ్, నీలేష్, శివ, బీట్ అధికారులు నవీన్, వాల్యనాయక్, కిరణ్‌కుమార్, నాగార్జున, శ్యామ్, మాధవి, లక్ష్మణ్, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



కొల్లాపూర్‌లో అభివాదం చేస్తున్న నాయకులు

కొల్లాపూర్: వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి బోయ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం పట్టణంలోని మహెబూబ్ ఫంక్షన్‌హాల్‌లో వాల్మీకి బోయల సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం సభలో కులసంఘ నాయకులు, ఉద్యోగులు మాట్లాడారు. వాల్మీకి బోయలను దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ఎస్టీ జాబితాలో చేర్చారన్నారు. తెలంగాణలో మాత్రం నేటికీ బీసీలుగానే పరిగణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అంతకుముందు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన బోయలు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా నియోజకవర్గ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా పెద్దమారూర్ గ్రామానికి చెందిన రాజ్‌కుమార్‌ను, ప్రధాన కార్యదర్శిగా కొల్లాపూర్ పట్టణానికి చెందిన బోగిమల్ల కృష్ణమనాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సుధాకర్‌నాయుడు, గోపాల్‌నాయుడు, వెంకటేష్‌నాయుడు, పరశురాముడు, నర్సింహ్మా, మల్లయ్య, ప్రసాద్‌నాయుడు, సత్యం, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

పెంట్లవెల్లిలో..

పెంట్లవెల్లి: వాల్మీకీలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆ సంఘం మండల నాయకుడు డిష్ శేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వాల్మికీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయన్నారు. అనంతరం కొల్లాపూర్‌లో నిర్వహించే వాల్మికీల నియోజకవర్గ స్థాయి సమావేశానికి బైక్ ర్యాలీ ద్వారా కార్మికులు బయలుదేరారు. కార్యక్రమంలో శేఖర్, నర్సింహనాయుడు, బాలరాజు, రాజు, నిరంజన్, భాస్కర్, శివ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు అందిస్తాం



అమ్రాబాద్‌లో రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అమ్రాబాద్: అర్హులందరికీ రేషన్ కార్డులు అందిస్తామని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మంగళవారం అమ్రాబాద్ ఎంకే ఫంక్షన్ హాలులో కొత్త రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. గత బీఆర్ఎస్ పాలనలో రేషన్‌కార్డులు లేక పేదలు ఎంతో ఇబ్బంది పడ్డారన్నారు. అమ్రాబాద్, పదర మండలాల్లో 3500లకు పైగా రేషన్ కార్డులు మంజూరయ్యాయన్నారు. రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హరినారాయణగౌడ్, రామలింగయ్యయాదవ్, తహసీల్దార్ శైలేంద్రబాబు, నాయకులు, అమ్రాబాద్, పదర మండలాల లబ్ధిదారులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

అచ్చంపేట రూరల్: నియోజకవర్గంలోని హాస్టళ్లు, పాఠశాలలలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రిన్సిపాల్స్, హాస్టల్ వార్డెన్లతో, ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...మెనూ ప్రకారం విద్యార్థులకు తప్పకుండా పౌష్టికాహారం అందించాలన్నారు. జిల్లా అధికారులతో పాటు, స్థానిక ప్రిన్సిపాల్స్, వార్డెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం



నాగర్‌కర్నూల్: కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధిలోని 15 వా వార్డ్‌కు సంబంధించిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకులు పేదలను పట్టించుకోలేదని విమర్శించారు. అర్హులందరికీ ఇల్లు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడుపొద్దు

వెల్దండ: మద్యం తాగి వాహనాలు నడుపొద్దని ఎస్ఐ కురుమూర్తి కోరారు. మంగళవారం హైదరాబాదు–శ్రీశైలం జాతీయ రహదారిపై డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్ తదితర ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

కందనూలు: నాగర్‌కర్నూల్ మండలంలోని మంతటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన ఎన్నారై వెంకట్‌రెడ్డి మంగళవారం వివిధ సామగ్రి అందజేశారు. రూ.5 లక్షల విలువ చేసే వివిధ సామాగ్రి స్పోర్ట్స్ దుస్తులు, చెస్‌బోర్డులు, 2 నూతన బాత్‌రూంలు, 25 కుర్చీలు, బీరువా, వస్తువులను అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌సీ టాపర్లకు నగదు పురస్కారాలు

కొల్లాపూర్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గత విద్యాసంవత్సరం ఎస్ఎస్‌సీలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు క్లాస్‌మేట్ క్లబ్ సభ్యులు నగదు పురస్కారాలు అందజేశారు. 14 పాఠశాలలకు చెందిన విద్యార్థులకు మంగళవారం పట్టణంలోని ఆర్ఐడీ పాఠశాలలో పురస్కారాలు అందజేసి, సత్కరించారు. ఒక్కో విద్యార్థికి రూ.1,116 చొప్పున నగదు అందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఎమ్మానుయేల్ మాట్లాడుతూ విద్యార్థులను చదువుల్లో ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో క్లాస్‌మేట్ క్లబ్ వ్యవస్థాపకులు వాస రాఘవేంద్ర, డాక్టర్ కొండా శ్రీదేవి, కేపీ ప్రసాద్, శ్రీదేవీ, కుసుమ, రాధిక తదితరులు ఉన్నారు.

‘ఉపాధి’ కూలీలకు కనీస వేతనం అమలు చేయాలి



మాట్లాడుతున్న నరసింహ

ఉప్పునుంతల: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు కనీసం వేతనం రూ. 800లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో పనుల వద్ద రెండు పూటల ఫొటో విధానాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. కూలీలకు 200ల రోజులు పని కల్పించడంతోపాటు భూమిలేని ఉపాధి కూలీల కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన హామీమేరకు ఆత్మీయ భరోసా కింద రూ. 12 వేలు వెంటనే ఇవ్వాలన్నారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం భవిష్యత్తు ప్రణాళికపై చర్చించారు. సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ప్రజాతంత్ర బాధ్యులు వర్దం పర్వతాలు, జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు బాలస్వామి, సహాయ కార్యదర్శి చింతల నాగరాజు, నాయకులు దేశ్యానాయక్, భాస్కర్, సైదులు, రాములు తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ ఆకస్మిక తనిఖీ

కందనూలు: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్‌కుమార్ అన్నారు. మంగళవారం నాగర్ కర్నూల్ మండలంలోని ఎండబెట్ల గ్రామంలోని ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, గణిత, ఆంగ్లం సామర్థ్యాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఆరోగ్యం, చదువు అత్యంత ప్రాధాన్యమైనదని అన్నారు. అనంతరం పాఠశాలలో నాటిన మొక్కలను పరిశీలించి ఉపాధ్యాయులను అభినందించారు.

రైతులను ఇబ్బంది పెడితే చర్యలు



తెలకపల్లి: రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్‌రావు హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం ఎరువుల గోదాంతోపాటు రిటైల్ డీలర్స్ అవులెట్ దుకాణాలను పరిశీలించారు. ఈసందర్భంగా దుకాణాల్లో సింగిల్ విండో కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఎరువుల దుకాణాలను పరిశీలించారు. రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. స్టాక్ బోర్డులు ఏర్పాటు చేయాలని డీలర్లకు సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి నర్మద పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



తెలకపల్లి: మండల కేంద్రంలోని భ్రమరాంబిక ఆలయంలో మంగళవారం భ్రమరాంబిక మల్లికార్జున స్వామి శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు. తెల్లవారుజామున యజ్ఞం, 11 గంటలకు కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగింది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పూజారి శ్రీధర్, భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

తాడూరు: బస్సు సౌకర్యం కల్పించాలంటూ మండలంలో మేడిపూర్ విద్యార్థులు హైదరాబాద్ వెళ్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. విద్యార్థులతో ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి ముచ్చటించడంతోపాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కల్వకుర్తి డిపో బస్సు మేడిపూర్ మీదుగా ఐతోలు ఆకునెల్లికుదురు, బాలాన్‌పల్లికి వెళ్లే బస్సు వేళలు అనుకూలంగా లేవని వివరించారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి కల్వకుర్తి డీఎంకు ఫోన్ చేసి మాట్లాడారు. పాఠశాలకు వచ్చి వివరాలను తెలుసుకొని విద్యార్థులకు అనుగుణంగా నడిపించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డుకు మరమ్మతు



కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డు ప్రభుత్వ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలకు సీసీ రోడ్డు వేయాలని కొన్ని రోజుల నుంచి ఏబీవీపీ విద్యార్థులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో స్పందించిన మున్సిపల్ అధికారులు స్పందించి మంగళవారం కళాశాలకు వెళ్లే రోడ్డుకు మరమ్మతు చేయించారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ

పెద్దకొత్తపల్లి: మండలంలోని దేవల్ తిరుమలాపూర్‌లో మూడో అంగన్‌వాడీ కేంద్రం నూతన భవనానికి మంగళవారం మాజీ సర్పంచ్ సత్యం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారం, మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడు కృషితో భవన నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ, డీఈ, ఏఈ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పశుసంపదను కాపాడుకుందాం



రాచూర్‌లో టీకాలు వేస్తున్న సిబ్బంది

వెల్దండ: పశుసంపదను కాపాడుకుందామని పశు వైద్య అధికారి శ్యామ్‌సుందర్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రాచూర్, కొట్ర గ్రామాల్లో గొర్రెలకు, మేకలకు నీలి నాలుక వ్యాధి రోగ నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో గొర్రెలకు, మేకలకు నీలినాలుక, మూతివాపు రోగం వలన జీవాలు ఆరోగ్యం కుంటుపడి మూతివాపులు, సొల్లు, ఆకలి మందగించడం, జ్వరం, కాళ్ల గిట్టల్లో వాపు వస్తుందన్నారు. వ్యాధులను గుర్తించి కాపలాదారులు ముందస్తు టీకాలను వేయించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది నరేష్‌రెడ్డి, నరసింహ, శ్రీను, గోపాలమిత్రలు మొగులయ్య, బాలు, సాయిబాబా, ఫణిందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

తిమ్మాజిపేట: మండలంలోని మరికల్, అమ్మపల్లి గ్రామాల్లోని గొర్రెలకు పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలు వేశారు. రెండు గ్రామాల్లో 1800 వరకు గొర్రెలకు టీకాలు వేసినట్లు మండల పశు సంవర్ధకశాఖ వైద్యాధికారి ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. డా. శ్రావణి, సిబ్బంది తిరుపతయ్య, విజయలలిత, అమీర్, యాదగిరి, రవి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం

కల్వకుర్తి టౌన్: పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ సిబ్బందికి సూచించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్యంపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షపునీరు నిల్వకుండా చూడాలన్నారు. సమావేశంలో ఏఈ షబ్బీర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగన్న, వార్డు ఆఫీసర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గరుడ వాహనసేవలో వట్టెం వెంకన్న



బిజినేపల్లి : మండలంలోని వట్టెం వేంకటేశ్వర స్వామి వార్లు ఆలయ తీరు వీధుల్లో గరుడ వాహనంపై ఊరేగింపు చేశారు. గరుడ పంచమి సందర్భంగా వేంకన్న సమేత ఉత్సవ మూర్తులను ఆలయ కాలనీల్లో ఊరేగించారు. గరుడ పంచమి సందర్భంగా గిరిజన ప్రజలు, నవోదయ విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ



కల్వకుర్తి రూరల్: మండలంలోని మార్చాల బంగారు మైసమ్మ బోనాల ఉత్సవం మంగళవారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా దేవాలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి మొక్కలు చెల్లించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు తల్లోజు ఆచారి ఉత్సవంలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలకపల్లి: మండలంలోని గౌరారంలో మంగళవారం బోనాల ఉత్సవాలు నిర్వహించారు. చింతకుంట్ల వంశీయులైన కోటమైసమ్మ బొడ్రాయి దగ్గర నుంచి మహిళలు ఊరేగింపుగా బోనాలతో ఎల్లమ్మ తల్లి దేవాలయానికి చేరుకున్నారు. ఎల్లమ్మ దేవతకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం



తాడూరు: ప్రజా సమస్యల పరిష్కారం కోసం పేదల పక్షాన సీపీఐ నిరంతరం పోరాటం చేస్తుందని రాష్ట్ర సమితి సభ్యులు వార్ల వెంకటయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 1, 2న కల్వకుర్తిలో సభ నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. నాయకులు భరత్ శివశంకర్ వెంకటస్వామి, సత్యం, రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



చారకొండలో వంట గదిలో భోజనం పరిశీలిస్తున్న తహసీల్దార్ సునీత

చారకొండ/వెల్దండ/తాడూరు: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని చారకొండ, వెల్దండ, కల్వకుర్తి తహసీల్దార్లు సునీత, కార్తీక్‌కుమార్, ఇబ్రహీం అన్నారు. చారకొండలోని కేజీబీవీ పాఠశాలను, వెల్దండలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను, కల్వకుర్తిలో గిరిజన గురుకుల బాలికల పాఠశాలలను ఆయా తహసీల్దార్లు మంగళవారం సందర్శించారు. విద్యార్థులకు అందించే కూరగాయలు, బియ్యం, ఇతర వంట సామాగ్రిని పరిశీలించారు. అదేవిధంగా వెల్దండ కస్తూర్బాగాంధీ పాఠశాలను ఇన్‌చార్జ్ ఎంఈఓ చంద్రుడు, తాడూరు మండలంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఎంపీడీఓ ఆంజనేయుల ఆకస్మికంగా తనిఖీ చేశారు. వారి వెంట ఎస్ఓ మంజుల, ఆర్ఐ శంకర్‌నాయక్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జానకి, ప్రిన్సిపాల్ స్రవంతి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి



ఎర్రగడ్డ కాలనీలో పుట్టకు పూజలు చేస్తున్న భక్తులు, మహిళలు

కందనూలు: జిల్లా కేంద్రంలో మంగళవారం నాగుల పంచమిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచే దేవాలయాలకు బారులు తీరారు. రాంనగర్ కాలనీలోని రామస్వామి దేవాలయం, ఎర్రగడ్డ కాలనీలోని సుబ్రహ్మణ్యం దేవాలయం, హౌజింగ్ బోర్డులోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో భక్తులు పూజలు నిర్వహించి నాగదేవతకు పాలు పోశారు. ఆలయ పూజారుల నుంచి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వెల్దండ: మండల కేంద్రంతో ఆయా గ్రామాల్లో నాగుల పంచమి సందర్భంగా గుండాల వద్ద మహిళలు పుట్టలకు పూజలు చేశారు. కార్యక్రమంలో పురోహితులు శివశర్మ, సురేష్‌శర్మ తదితరులు ఉన్నారు.

మన్ననూర్: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం ప్రాంగణంలో నాగుల పంచమి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి వారి ఆలయం వెనుక భాగంలో ఉన్న పుట్ట వద్ద భక్తులు కుంకుమార్చనలతో పాటూ పుట్టలో పాలు పోసి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో భక్తులు సంబు శోభ, వెంకటరమణ, పద్మజా, సత్యనారాయణ సుమతి, అనిత తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: పట్టణంలోని పలు దేవాలయాల్లో భక్తులు నాగుల చవితి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. భ్రమరాంబదేవాలయంతో పాటు పలు దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



వెల్దండ మండలం గుండాలలో



అచ్చంపేటలో పూజలు చేస్తున్న భక్తులు